క్లుప్తంగా

ఆర్థిక సాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మహాలక్ష్మి నగర్‌లో నివాసం ఉండే కర్రోళ్ల సాయిలు భార్య మున్నాబాయి కొంతకాలంగా నోటి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మంగళవారం చని పోయింది. పేద కుటుంబం కావడంతో శ్రీలక్ష్మి చేయూత సేవా సమితిని ఆశ్రయించారు. వెంటనే స్పందించి బుధవారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సమితి అధ్యక్షులు రమణాచారి, అలువాల లక్ష్మణ్, తాటి శామ్ కుమార్, పాపిని సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన జిల్లా నేతలు



ఖలీల్‌వాడి: న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ మాజీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా జిల్లా నేతలు కలిశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం గురించి ఢిల్లీ నేతలకు వివరించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు, రామర్తి గోపి, బొబ్బిలి రామకృష్ణ, విపుల్ గౌడ్‌లు ఉన్నారు.

కళాకారులకు పురస్కారాలు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నగరంలోని సీతారాం నగర్‌లో గల తెలుగు–వెలుగు సమాఖ్య కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఇందూరు రంగస్థల కళాకారులైన శ్రీపాదకుమార శర్మ, సుదర్శన్, కళాధర్, ప్రకాష్, సాయన్నలను సన్మానించారు. కార్యక్రమంలో వీపీ చందన్‌రావు, నాగరాజు శర్మ, వేముల శేఖర్, లింగ వర్ధన్, పోశెట్టి, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు గౌడ సంఘ సభ్యులు రూ.25 వేలను విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గడ్డం రాజారెడ్డికి విరాళం అందజేశారు. ఉపసర్పంచ్ బాల్‌కిషన్, ఎంపీటీసీ సభ్యుడు గంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

జోన్ కార్యాలయం ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని అర్సపల్లి నగరపాలక సంస్థ 5వ జోన్ కార్యాలయాన్ని బుధవారం అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సులభతరమైన పాలన కోసం జోన్ కార్యాలయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జోన్ కార్యాలయాలలలో అధికారులు, కార్పొరేటర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలుపరిష్కరించాలని కోరారు. మేయర్ దండు నీతూ కిరణ్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో దీపోత్సవం

నిజామాబాద్ సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం కంఠేశ్వర్ ఆలయంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాలను వెలిగించారు. చిన్నారులను సన్మానించారు. ఆలయ చైర్మన్ బిల్ల మహేష్, ఈవో వేణు, ధర్మకర్తలు గంగామణి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఖలీల్‌వాడి: దశాబ్ది ఉత్సవాల మీద ఉన్న శ్రద్ధ రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో లేదని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రూ.లక్ష రైతు రుణ మాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో నరసయ్య, నడిపి భూమన్న, దేవస్వామి, గోపాల్, నిమ్మల భూమేష్, పోచమ్మ పాల్గొన్నారు.

అర్ధరాత్రి 'బార్'లా తెరిచారు



ఖలీల్‌వాడి : నగరంలోని శివాజీనగర్ చౌరస్తాలోని ఓ బార్, గుర్బాబాది రోడ్డు వద్ద ఉన్న బార్‌లో రాత్రి 11 గంటల తర్వాత షెటర్ ఓపెన్ చేసి ప్రతిరోజు, మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రతిరోజు బార్‌లను 11 గంటలకు మూసివేయాల్సి ఉంటుంది. అయితే అలా సమయానికి బార్లను మూయకపోగా షెట్టర్లను ఓపెన్ చేసి బయట వ్యక్తులకు రాత్రిళ్లలో దర్జాగా అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై పోలీసులు కాని, ఎక్సైజ్ అధికారులు కాని పట్టించుకోవట్లేదు. జిల్లా కేంద్రంలో రూ. 20 నుంచి రూ. 50 వరకు అధిక ధరలకు దర్జాగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వివరణ కోరగా బార్ మద్యం బయటకు అమ్మరాదని బార్‌లో అమ్మాల్సి ఉంటుందన్నారు. ఎక్సైజ్ సీఐని పంపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బెటాలియన్‌లో యోగాసనాలు వేస్తున్న కమాండెంట్ సత్యశ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది



మంచిప్ప పాఠశాలలో.. విద్యార్థులు



తెయూలో విద్యార్థినుల యోగాసనాలు

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్:నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర చోట్ల బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు యోగాసనాలు వేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఈ సందర్భంగా యోగా గురువులు తెలిపారు. భారతదేశం, ప్రపంచానికి అందించిన అపూర్వ కానుక యోగా అని టీఎస్ఎస్పీ ఏడవ బెటాలియన్(డిచ్‌పల్లి)లో కమాండెంట్ ఎన్‌వీ సత్య శ్రీనివాసరావు పేర్కొన్నారు. యోగాపై అవగాహన కల్పించి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



తెయూలో .. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి



కేంద్రీయ విద్యాలయంలో ..



ఫ్యూచర్ పాఠశాలలో ..



సుభాష్‌నగర్‌లో ..



సిరికొండలో .. బీజేపీ నాయకులు



మున్నూర్‌కాపు సంఘంలో ..బీజేపీ నేత ధన్‌పాల్



నగరంలో యోగాసనాలు వేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, తదితరులు

దర్జాగా విద్యుత్ చౌర్యం

- డీ–5 సెక్షన్‌కు కూతవేటు దూరంలో..
- ఏళ్ల తరబడిగా ఇదే తంతూ

నిజామాబాద్‌నాగారం: పేదలు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఆగమేఘాల మీద దాడులు చేసి కేసులు నమోదు చేసే విద్యుత్ అధికారులు. నిజామాబాద్ నగరంలో డీ–5 సెక్షన్ పరిధిలో ఏళ్ల తరబడిగా విద్యుత్ చౌర్యం జరుగుతున్నా మిన్నకుండటం గమనర్హం. గంగాస్థాన్ ఫేజ్–1లోని వాటర్‌ట్యాంక్ ప్రాంతంలో మొక్కలు, పార్కుకు సంబంధించిన బోరు బావికి విద్యుత్ కనెక్షన్ లేదు. దీంతో ఏళ్ల తరబడిగా మున్సిపల్ అధికారులు, సిబ్బందితో అక్రమంగా ప్రతినిత్యం విద్యుత్ వైర్లపై కొండీలు తగిలించి బోర్ బావి ఆన్ చేసి మొక్కలకు నీళ్లు పోస్తున్నారు. ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున అక్రమంగా వైర్లు తగిలించి బోరుబావి నడిపిస్తున్నారు. ఇదంతా డీ–5 సెక్షన్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరుగుతున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనర్హం. అక్రమంగా విద్యుత్ వైర్లకు కొండీలు తగిలిస్తున్న సమయంలో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అవుతోంది.



విద్యుత్ వైర్లకు కొండీలు తగిలిస్తున్న సిబ్బంది

అన్ని మతాలకు సముచిత న్యాయం

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/సుభాష్‌నగర్/నిజామాబాద్ సిటీ: తెలంగాణ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాలు, మతాలకు సముచిత న్యాయం చేస్తున్నారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని ప్రముఖ లూర్దు మాత క్యాథలిక్ చర్చిలో, నడిపల్లి గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులతో, డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ మజీద్‌లో ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సర్వమత సమ్మేళనానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ధర్మారం(బి) గ్రామాన్ని రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. అలాగే నడిపల్లి నుంచి మాధవనగర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కొంతమంది బీజేపీ నాయకులు, మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు.. హిందువులమై ఉండి, దేశం ఆపదలో ఉందనటం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అర్చకులకు ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనం ఆర్డర్ కాపీలను, ఉత్తమ సేవలందించిన అర్చకులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, మాధవనగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, సాయిబాబా ఆలయం ఈవో రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ధర్మారం(బి) లూర్దుమాత చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

తెలంగాణాలోనే పెన్షన్ ఎక్కువ

ఇందల్వాయి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇందల్వాయి సాయిబాబా ఆలయంలో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల పండగ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.4,116 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ సంబరి మోహన్, ఎంపీపీ రమేష్ నాయక్, వైస్ ఎంపీపీ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- జీపీలకు నిధులు రాక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌ల ఆవేదన
- ఎజెండా కాపీలను చించేసిన మునిపల్లి సర్పంచ్ సాయరెడ్డి

జక్రాన్‌పల్లి: సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు నిర్వహించడం వృథా అని మునిపల్లి సర్పంచ్ సాయరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జక్రాన్‌పల్లి మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ సాయరెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. అప్పులు చేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేశామన్నారు. కానీ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట సఫాయి కార్మికులకు జీతాలు ఇవ్వకుండా సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం శోచనీయమన్నారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎజెండా కాపీని చించేసి సమావేశాన్ని బైకాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం ఎంపీవో యూసుఫ్‌ఖాన్ మాట్లాడుతూ చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం ఏవో దేవిక మాట్లాడుతూ జూన్ 16 వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పలు సమస్యలు సభలో చర్చించారు. ఈ సమావేశానికి కేవలం ఐదుగురికి నలుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీ కుంచాల విమల, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో నటరాజ్, ఏవో దేవిక, సభ్యులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న మునిపల్లి సర్పంచ్



మాట్లాడుతున్న ఎంపీపీ విమల

పేదలకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

- ఇవి దశాబ్ది దగా ఉత్సవాలు
- నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆర్.భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ: దశాబ్ది ఉత్సవాలు దగా ఉత్సవాలని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆర్. భూపతిరెడ్డి విమర్శించారు. ఖానాపూర్ శివారు పవార్ గార్డెన్‌లో బుధవారం రూరల్ మండలం కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏ రంగంలో అభివృద్ధి సాధించలేదని, అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని అన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో రైతులు, విద్యార్థులు ఉంటే ప్రభుత్వాన్ని నిలదీస్తారని, అందుకే వారిని పిలువకుండా కేవలం అధికారులతోనే ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మి దాదాపు రెండు నెలలు కావస్తోంది.. ఇప్పటికి రైతుల ఖాతాలలో డబ్బులు జమ కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రూరల్ నియోజకవర్గ ప్రజలు బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే ఆయన సీఎం కాళ్లు మొక్కుతున్నారని, ఓట్లు వేసింది ఇందుకేనా అని ప్రశ్నించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి నీళ్లు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్, కిసాన్ కేత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత భూపతిరెడ్డి

యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ బృందం యూనివర్సిటీని సందర్శించింది. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిసి వర్సిటీ సమస్యలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెహమాన్ మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా తెయూకు ఇన్‌చార్జి వీసీని నియమించాలని, పాలక మండలి తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షించాలన్నారు. క్యాంపస్‌లో నూతన హాస్టల్ భవనాలను నిర్మించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

26న ఉచిత మెడికల్ క్యాంప్

నిజామాబాద్‌నాగారం: మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్టు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ పర్సన్స్ అసోసియేషన్, గ్రేస్ క్యానర్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 26న నగరంలోని నాందేవ్‌వాడలో గల మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్టు భవనంలో ఉచిత మెడికల్ క్యాంపు ఉంటుందని జిల్లా అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు తెలిపారు. ఇందులో క్యాన్సర్ నిర్ధారణ టెస్టులు ఉచితంగా చేస్తారన్నారు. 27న అర్సపల్లి, 28న నాగారం బహుజన కాలనీలో నిర్వహిస్తున్నారు.

యువకుడి అదృశ్యం

ఖలీల్ వాడి: నగరంలోని 3వ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బాకి చెందిన మహమ్మద్ ఫయాజ్(23) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 19న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. తండ్రి మహమ్మద్ షోయబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులు



నగరంలోని కంఠేశ్వర్‌లో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే, మేయర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,750	వెండి (కిలో)	75,500
22 క్యారెట్స్	56,008		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	36	60	క్యాప్సికం	50	70
బెండకాయ	20	40	గాజరుగడ్డ	30	50
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	80	110
దొండకాయ	20	40	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	100	130	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	15	30
వంకాయ	30	50	గోబిపువ్వు	40	60
పాలకూర	30	50	బీట్‌రూట్	30	50
మెంతికూర	70	90	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	80	100	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			

– ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఫ్లాష్ (ఇంగ్లిష్ – 2డీ) – 10.10
	ఆది పురుష్ (తెలుగు) – 12.50, 4.10, 7.30, 10.50
స్క్రీన్-2	ఆది పురుష్(తెలుగు) -1.00,4.20 7.30,10.50
స్క్రీన్-3	ఆది పురుష్(తెలుగు)- 10.30 ది ఫ్లాష్(ఇంగ్లిష్)2డీ-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆది పురుష్ (తెలుగు – 3డీ) –8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-2	ఆది పురుష్ (తెలుగు – 3డీ) – 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3	ఆది పురుష్ (తెలుగు – 2డీ) – 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-4	ది ఫ్లాష్ (తెలుగు) –12.45 ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లిష్ – 2డీ) –3.55 ది ఫ్లాష్ (ఇంగ్లిష్) – 6.50, 10.00
దేవి	విమానం
నటరాజ్	ఆది పురుష్ (హిందీ)
లలితామహల్	టక్కర్(తెలుగు)
విజయ్	ఆది పురుష్ (తెలుగు)

సంక్షిప్తం

ఎండతో విద్యార్థులకు ఇబ్బంది

నిజామాబాద్ నాగారం: ఒలింపిక్ రన్ సందర్భంగా విద్యార్థులు ఎండలో ఇబ్బందులు పడ్డారని అథ్లెటిక్స్ సీనియర్ క్రీడాకారుడు సయ్యద్ ఖైసర్ పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఉదయం 10 గంటల లోపు రన్ పూర్తి చేస్తారని, ఈసారి 10.30 గంటల తర్వాత ప్రారంభించారన్నారు. విద్యార్థులను ఎండలో గంటల తరబడిగా నిలబెట్టారని పేర్కొన్నారు. నీడ కోసం ఎలాంటి టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

మైనర్ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని శిక్షించాలి

ఖలీల్‌వాడి: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో 13 ఏళ్ల బాలికపై అత్యాచారం పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మైనార్టీ కాంగ్రెస్ సీనియర్ నేత సయ్యద్ ఖైసర్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ పట్టణ ఫ్లోర్ లీడర్ తమ్ముడు రవీందర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన నేతలు దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్నా ఎమ్మెల్యే షకీల్ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

తెలంగాణ జాతిపితకు ఘన నివాళి

సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ 12వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ నరసయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ మోహన్‌సింగ్‌కు ..

తెయూ(డిచ్‌పల్లి): ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మోహన్‌సింగ్ మృతి పట్ల తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం విభాగాధిపతి ఎండీ జమీల్ అహ్మద్ మాట్లాడుతూ.. మాన్‌సింగ్ తెలంగాణ యూనివర్సిటీకి అనేక హిందీ పుస్తకాలు వితరణ చేశారని తెలిపారు. బీవోఎస్ చైర్‌పర్సన్ పార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

సిరికొండ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వడ్డీ లేని రుణాలను అందించాలని, ఎరువులు విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాబన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ప్రజా పంథా ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి రమేశ్, సాయ రెడ్డి, లింబాద్రి రమేష్, రాజన్న, సంతోష్ పాల్గొన్నారు.

'ఉపా' కేసులను వెంటనే ఎత్తివేయాలి

ధర్పల్లి: ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులుపై ఉపా చట్టం కింద పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని న్యూడెమొక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. నేతలు బాలయ్య, కారల్ మార్క్స్, భూమేష్ పాల్గొన్నారు.

చట్టాన్ని రద్దు చేయాలి

ఖలీల్‌వాడి: ఉపా చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సుధాకర్ మాట్లాడారు. ఉపా, దేశద్రోహ చట్టా లు తేవడం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. నేతలు వై.ఓమయ్య, పి.హనుమాండ్లు, నవీన్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
(ACO) : 9951027699
: 7997958181
: 9848956776
(ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899